
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
మంగళవారం 14 జూలై 2026 పేజీలు : 8

## సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలు సకాలంలో నమోదు చేయాలి

### మహిళలపై నేరాలు, గ్రేవ్ కేసుల్లో అలసత్వం వద్దు
### రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



## కెమికల్ డ్రగ్స్ విక్రయిస్తున్న
# ముఠా గుట్టురట్టు





**7 గురు నిందితులపై కేసు నమోదు ముగ్గురు అరెస్టు -- నలుగురు పరారీ**

**"టర్మిన్" మత్తు ఇంజెక్షన్ల విక్రయం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**190 ఇన్సులిన్ సిరంజి లు, 50 టర్మిన్ బాటిల్స్, ఒక స్కూటీ రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం**

కెమికల్ డ్రగ్స్ విక్రయిస్తున్న మూఠా గుట్టు పోలీసులు ర ట్టు చేశారు. ఏడుగురు నింది తులపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. మ రో నలుగురు పరారీలో ఉ న్నారు. టర్మిన్ మత్తు ఇంజక్ష న్ లు ఈ మూట విక్రయిస్తు న్నారు. 190 ఇన్సూలిన్ సిరంజిలు, 50 టర్మిన్ బాటిల్స్, ఒ క స్కూటీ, 2 మొబైల్ ఫోన్లు వీరి నుండి పోలీసులు స్వాధీ నం చేసుకున్నారు.ఎ-1: సిందే జగన్నాథ్(50), గుణవం తరావు, వృత్తి: ఆర్ఎంపీ డాక్టర్, నివాసం: శాంతినగర్, ఆదిలాబాద్. (అరెస్టు), ఎ-2: రమేష్ గౌడ్, జగదాంబ ఫార్మసీ సర్జికల్స్

## " ప్రజావాణి" దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి



## నులిపురుగుల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలి



# నులిపురుగుల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలి





## : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** జిల్లాలో పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్‌తో కలిసి పాల్గొని విద్యార్థులకు స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలు తినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులందరికీ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య, విద్య, సంక్షేమ, మున్సిపల్, గ్రామపంచాయతీ తదితర శాఖలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. నులిపురుగుల నిర్మూలన వల్ల రక్తహీనత తగ్గడంతో పాటు పిల్లల పోషకాహార స్థితి మెరుగుపడి, మానసిక, శారీరక ఎదుగుదల, అభ్యాసన సామర్థ్యం, పాఠశాల హాజరు శాతం పెరుగుతాయని తెలిపారు. 1 నుంచి 3 సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను చూర్ణం చేసి నీటితో ఇవ్వాలని, 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను నమిలి తీసుకునేలా చూడాలని సూచించారు. పరిశుభ్రమైన నీటిని తాగడం, భోజనం ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పాదరక్షలు ధరించడం వంటి వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు తప్పనిసరిగా పాటించాలన్నారు. బహిరంగ మలవిసర్జన, మురికి చేతులు, చెప్పులు లేకుండా తిరగడం వల్ల నులిపురుగులు వ్యాపించి రక్తహీనత, ఆకలి లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పిల్లలందరికీ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు సమీకృత శిక్షణ**

అనంతరం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న సమీకృత శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతిరోజూ ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆధునిక బోధనా విధానాలను అనుసరించాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ తన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తరగతి గదిలో విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించేలా బోధన సాగించాలని, వినూత్న పద్ధతులతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంకు ఖాతాదారులైన సింగరేణి పెన్షన్‌దారులకు ప్రమాద బీమా కల్పించాలి

**మంచిర్యాలలో యూనియన్ బ్యాంకు ఎదుట సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ధర్నా**





**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ బి ఐ)లో ఖాతాలు కలిగిన సింగరేణి కోల్ మైన్స్ పెన్షన్ దారులకు అందిస్తున్న ప్రమాద బీమా సౌకర్యాన్ని, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాలు కలిగిన పెన్షన్‌దారులకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంకు శాఖ ఎదుట సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ గుల్షన్ కుమార్‌కు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, గత రెండు నెలలుగా యూనియన్ బ్యాంకు అధికారులను పలుమార్లు కలిసి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరినా సరైన స్పందన లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నిరసనగా బ్యాంకు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి మరోసారి తమ డిమాండ్‌ను వినిపించామని తెలిపారు. ఎస్‌బీఐ బ్యాంకు మాదిరిగానే యూనియన్ బ్యాంకు కూడా సింగరేణి కోల్ మైన్స్ పెన్షన్‌దారులకు రూ.50 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ అంశంపై 15 రోజుల్లోగా బ్యాంకు యాజమాన్యం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని, లేనిపక్షంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి యూనియన్ బ్యాంకు శాఖల ఎదుట పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షులు ఏ. గంగయ్య, పి. రాంరెడ్డి, నాయకులు పోతురాజుల చంద్రయ్య, ఇరుకుళ్ల జనార్ధన్, ఎన్నం శంకర్, టి. జనార్ధన్ స్వామి, శశాంక్ రావు, బి. కృష్ణ, ఎస్. ఘటయ్య, కనిగంటి లచ్చయ్య, కాటం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను నిలిపివేయాలి

## 12వ వేజ్ బోర్డు చర్చలు వెంటనే ప్రారంభించాలి

## ఏఐటీయూసీ నాయకులు




**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి బొగ్గు గనుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే కేంద్ర ప్రభుత్వ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, కోయగూడెం బ్లాక్ సత్తుపల్లి బ్లాక్ సహా సింగరేణికి కేటాయించాల్సిన బొగ్గు బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని రద్దు చేసి, వాటిని పూర్తిగా సింగరేణి కాలరీస్ కంపెనీ (ఎస్‌సీసీఎల్)కే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్.కే. బాజీ సైదా లు డిమాండ్ చేశారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధికి, తెలంగాణ రాష్ట్ర ప్రగతికి సింగరేణి వెన్నెముకలాంటిదని పేర్కొన్నారు. అలాంటి ప్రభుత్వ రంగ సంస్థను బలహీనపరిచే విధానాలను కార్మికులు, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని హెచ్చరించారు. 11వ వేజ్ బోర్డు ఒప్పందం గడువు ముగిసిన నేపథ్యంలో 12వ వేజ్ బోర్డు చర్చలను ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ ఇండియా యాజమాన్యాన్ని కోరారు. పెరుగుతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని వేతన సవరణలో జాప్యం చేయడం కార్మికుల పట్ల అన్యాయమని, దీనివల్ల వేలాది మంది కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ బొగ్గు గనులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం వల్ల వేలాది మంది కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడటమే కాకుండా, సింగరేణి సంస్థ భవిష్యత్తు, తెలంగాణ రాష్ట్ర ఆదాయం, దేశ ఇంధన భద్రతకు కూడా తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కోయగూడెం బ్లాక్ సత్తుపల్లి బ్లాక్ తో పాటు ఇతర బొగ్గు బ్లాకులను పూర్తిగా ఎస్‌సీసీఎల్‌కే కేటాయించాలని, బొగ్గు గనుల వేలం (ఆక్షన్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలకు నష్టం కలిగించే ఎంఎండీఆర్ చట్టంలోని నిబంధనలను పునఃసమీక్షించి సవరించాలని కోరారు. అలాగే 12వ వేజ్ బోర్డు చర్చలను తక్షణమే ప్రారంభించి కార్మికులకు న్యాయం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌ల అమలు పేరుతో కార్మిక హక్కులను హరించే చర్యలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయాలు తీసుకోకపోతే అన్ని కార్మిక సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, సింగరేణి పరిరక్షణ కోసం అన్ని స్థాయిల్లో పోరాటాలు నిర్వహిస్తామని ఏఐటీయూసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆఫీస్ బేరర్లు మూడ సుధాకర్, అడ్డు శ్రీనివాస్, పిట్ సెక్రటరీలు నర్సింగరావు, నాగేశ్వరరావు, మీడియా ప్రతినిధి రాజ్ కుమార్, నాయకులు వెంకటేష్, మోహన్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సర్వే విజయవంతానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

## మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):**ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సర్వే విజయవంతం కావడానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో సహకరించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కోరారు. మంచిర్యాల లోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐఆర్ సర్వేపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ సర్వే ఈ నెల జూలై 24తో ముగుస్తుందని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన వారు, కొత్తగా ఓటరు నమోదు చేసుకునే వారు, అలాగే పేరు, చిరునామా, ఇంటి నంబర్, వయస్సు, ఫోటో తదితర వివరాల్లో మార్పులు అవసర మైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరొక పోలింగ్ కేంద్రానికి మార్పు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి ప్రక్రియలను కూడా ఈ సర్వే ద్వారా పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అవుతుందని, అనంతరం ఆగస్టు నుంచి అక్టోబర్ 24 వరకు అభ్యంతరాలు, సవరణలకు అవకాశం ఉంటుందని చెప్పారు. తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 31న విడుదల చేయనున్నట్లు తెలిపారు . ఈ సందర్భంగా విడుదల చేసిన అవగాహన పోస్టర్లలో “మీ ఓటు మీ బాధ్యత” అనే నినాదంతో కొత్త ఓటరు నమోదు, పేరు తొలగింపు, వివరాల సవరణ, పోలింగ్ కేంద్రం మార్పు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్ సర్వే ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కూడా పారదర్శకత పెరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు తదితర ప్రభుత్వ సేవలకు సంబంధించిన వివరాలను కూడా ప్రజలు సకాలంలో నవీకరించుకోవాలని సూచించారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. ఎస్ఐఆర్ సర్వే పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని, రాజకీయాలకు అతీతంగా ప్రజాహిత దృక్పథంతో సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా తమ వివరాలను నమోదు చేసుకొని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మేయర్ దర్నీ మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గజ్జెల హేమలత, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో బెల్లంపల్లి క్రీడాకారుల సత్తా

### అక్షయకు స్వర్ణం.. చిన్మయికి కాంస్యం.. త్రినయ్‌కు ఐదో స్థానం



**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లి క్రీడాకారులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లోని స్పోర్ట్‌పియా స్పోర్ట్స్ అకాడమీ క్రీడామైదానంలో నిర్వహించిన పోటీల్లో బెల్లంపల్లికి చెందిన ఆడిచర్ల అక్షయ, అరుసం చిన్మయి చైత్రిక, ఎడ్ల త్రినయ్ విశేష ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆడిచర్ల అక్షయ స్టాండింగ్ లాంగ్ జంప్ విభాగంలో 1.61 మీటర్లు దూకి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అరుసం చిన్మయి చైత్రిక 60 మీటర్ల పరుగుపందెంలో మూడో స్థానం సాధించి కాంస్య పతకాన్ని అందుకుంది. ఎడ్ల త్రినయ్ 300 మీటర్ల పరుగుపందెం లో ఐదో స్థానంలో నిలిచి ప్రతిభ చాటాడు. ఈ క్రీడాకారులకు సల్పాల సంతోష్ యాదవ్ కోచ్‌గా శిక్షణ అందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో బెల్లంపల్లి క్రీడాకారులు రాణించడం పట్ల మంచి ర్యాల అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఈ. మారయ్య అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ మెరుగైన విజయా లు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రతిభావంతులైన పోలీస్ క్రీడాకారులకు ప్రోత్సాహం కొనసాగుతుంది

## సీపీ అంబర్ కిశోర్ ఝా





**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** ప్రతిభ కలిగిన పోలీస్ క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026, క్లస్టర్--ఏ పోటీల్లో కాళేశ్వరం జోన్ 48 పతకాలు సాధించడం గర్వకారణమని ఆయన అన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ గ్రౌండ్స్‌లో ఇటీవల నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026, క్లస్టర్--ఏలోని 14 ఈవెంట్లు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులను సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో సీపీ అంబర్ కిశోర్ ఝా ఘనంగా సత్కరించారు. పతక విజేతలను వ్యక్తిగతంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జట్టు సమన్వయం, పరస్పర సహకారం, క్రమశిక్షణ, నిరంతర సాధన వల్లే ఈ స్థాయి విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. లోపాలను గుర్తించి సరిదిద్దుకుంటూ ముందుకు సాగితే మరిన్ని విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా కాళేశ్వరం జోన్ క్రీడాకారుల ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. పోలీస్ విధుల్లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన, సమన్వయం అత్యంత కీలకమని సీపీ తెలిపారు. క్రీడలు ఈ లక్షణాలను పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని, నేరాల దర్యాప్తు నుంచి శాంతిభద్రతల నిర్వహణ వరకు ప్రతి బాధ్యతలో జట్టు సమన్వయం విజయానికి దోహదపడుతుందని చెప్పారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని సమిష్టిగా పనిచేస్తే శాఖకు మరిన్ని విజయాలు సాధ్యమవుతాయని ఆకాంక్షించారు. క్రీడలకు సమయం కేటాయించే పోలీస్ అధికారులు సిబ్బందికి శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని, భవిష్యత్తులో కూడా రాష్ట్రస్థాయిలో మరిన్ని విజయాలు సాధించి శాఖకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని కూడా పెంపొందిస్తాయని, విధి నిర్వహణలో క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని వివరించారు. ఈ క్రీడల్లో కాళేశ్వరం జోన్ నుంచి 51 మంది పోలీస్ క్రీడాకారులు పాల్గొనగా, 31 మంది మొత్తం 48 పతకాలు సాధించారు. వీటిలో 8 బంగారు, 16 వెండి, 24 కాంస్య పతకాలు ఉన్నాయి. పతక విజేతల్లో రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు చెందిన నలుగురు, ములుగు జిల్లా నుంచి ముగ్గురు, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా నుంచి తొమ్మిది మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి 15 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, జోన్ సూపరింటెండెంట్ సందీప్, ఆర్ఐలు దామోదర్, మల్లేశం, శేఖర్, రమేష్, కాసిరామ్, శ్రీనివాస్, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి





జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల సాయికుంటలో సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఐఏఎస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో కలిసి విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నులిపురుగుల నిర్మూలన ద్వారా పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పాటు అందుతుందని తెలిపారు. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల సుమారు 1.80 లక్షల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నట్లు తెలిపారు .ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని 910 అంగన్వాడీ కేంద్రాలు, 749 ప్రభుత్వ పాఠశాలలు, 180 ప్రైవేటు పాఠశాలలు, 21 జూనియర్ కళాశాలలు ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 650 మంది ఆశా కార్యకర్తలు, 853 మంది అంగన్వాడీ కార్యకర్తలు, విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. పిల్లలకు వయస్సు ప్రకారం మాత్రలు ఇవ్వాలని సూచించారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు అర మాత్ర, రెండు నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను పొడి చేసి తినిపించాలని, పెద్ద పిల్లలు మాత్రను బాగా నమిలి మింగాలని తెలిపారు. మాత్ర వేసిన తర్వాత స్వల్ప వికారం లేదా కడుపునొప్పి వంటి లక్షణాలు కొందరిలో కనిపించవచ్చని, అవి తాత్కాలికమేనని, అవసరమైతే వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు .నులిపురుగులు ఉన్న పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, అలసట, శారీరక ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. అందుకే ప్రతి ఆరు నెలలకు ఒకసారి, సంవత్సరానికి రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం అవసరమని సూచించారు. ఇంటికి మాత్రలు పంపించబోమని, పాఠశాలలు లేదా అంగన్వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు మాత్రలు అందజేస్తామని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా నులిపురుగుల నివారణ సాధ్యమవుతుందన్నారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న పౌష్టికాహారం, వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని చదువుపై దృష్టి పెట్టి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈరోజు మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు జూలై 20న నిర్వహించే మాప్-అప్ కార్యక్రమంలో ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, ఏటీడబ్ల్యూఓ సురేష్, డాక్టర్ అమన్, జిల్లా మాస్ మీడియా బృందం సభ్యులు బుక్ వెంకటేశ్వర్, ఎం.డి. రషీద్, అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌వోలు నాందేవ్, పుట్ట సత్తయ్య, శ్రీనివాస్, కాకిరాల వెంకటేశ్వర్లు, డీపీహెచ్ఎన్ఆర్ఎస్ పద్మ, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ సబియా, వార్డెన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగి తన విధులను నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలి

రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యం

శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

ఫ్రంట్‌లైన్ సూపర్వైజర్లకు రిఫ్రెషర్ శిక్షణ ప్రారంభం



**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థకు మంచి పేరు తీసుకురావాలంటే ప్రతి ఉద్యోగి తన విధులను నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జీవీటీసీలో ఫ్రంట్‌లైన్ సూపర్వైజర్ల కోసం ఏర్పాటు చేసిన 12 రోజుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జి.ఎం మాట్లాడుతూ, ఏరియా పరిధిలోని ఓవర్‌మెన్లు, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్లు, మెకానికల్ ఫోర్‌మెన్లు, సర్వేయర్లు, సబ్‌ఓవర్‌సీర్లు కలిపి మొత్తం 48 మంది ఈ శిక్షణలో పాల్గొంటున్నారని తెలిపారు. ఉత్పత్తి, ఉత్పాదకతలో ఫ్రంట్‌లైన్ సూపర్వైజర్ల పాత్ర అత్యంత కీలకమని, వారి నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. శిక్షణలో మైనింగ్ చరిత్ర, ఆధునిక మైనింగ్ సాంకేతికత, రక్షణ ప్రమాణాలు, సూపర్వైజర్ల బాధ్యతలు, ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్, పేలుడు పదార్థాల వినియోగం, బ్లాస్టింగ్ విధానం, ఎలక్ట్రికల్ షట్ డౌన్ ప్రొసీజర్, ఎస్ఓపీ, ఎస్ఎంపీలు తదితర అంశాలపై అనుభవజ్ఞులు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధనతో పాటు నూతన విధానాలపై అవగాహన కల్పించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని తెలిపారు మనకు ఇప్పటికే తెలిసిన అంశాలే అన్న నిర్లక్ష్య భావనకు తావివ్వకుండా, శిక్షణలో చెప్పే ప్రతి విషయాన్ని శ్రద్ధగా విని పనిప్రదేశాల్లో అమలు చేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని జీఎం మునిగంటి శ్రీనివాస్ సూచించారు. చిన్న ప్రమాదం కూడా ఉత్పత్తికి ఆటంకం కలిగించడంతో పాటు ఏరియాకు చెడ్డపేరు తెస్తుందని, అందరూ "జీరో హార్మ్" లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన శ్రీరాంపూర్ ఏరియా మరోసారి రక్షణతో కూడిన ఉత్పత్తిలో సత్తా చాటాలని, అందులో ఫ్రంట్‌లైన్ సూపర్వైజర్లు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో తమ విధులను నిర్వర్తిస్తే గనికి, శ్రీరాంపూర్ ఏరియాకు, తద్వారా సింగరేణి సంస్థకు మంచి పేరు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి బాజీ సైదా, శ్రీరాంపూర్ ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, జీవీటీసీ మేనేజర్ షేక్ కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కిషన్‌రెడ్డి రాకతో నేడు సింగరేణి భరోసా యాత్ర ముగింపు సభ



**రామకృష్ణాపూర్,జూలై 13(ప్రజా జ్యోతి):** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొనే సింగరేణి భరోసా యాత్ర ముగింపు సభ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెన్నార్ గార్డెన్‌లో నిర్వహించనున్నారు. సభకు ముందు శ్రీనివాస్ గార్డెన్ నుంచి ఎమ్మెన్నార్ గార్డెన్ వరకు సుమారు 500 బైక్‌లతో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. తాడిచెర్ల బ్లాక్--2ను సింగరేణికి కేటాయించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సంస్థతో పాటు రాష్ట్రానికి కూడా భారీ ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, పెన్షనర్లు, మేధావులు, విద్యార్థులు, ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గం అశోక్, ఆరుముళ్ల పోశం, అందుగుల శ్రీనివాస్, అక్కల రమేష్, బంగారు వేణుగోపాల్, సప్పిడి నరేష్, గిరినాటి జనార్ధన్, దేవనేని సంజీవరావు, డి.వి. దీక్షితులు, మల్యాల రాయమల్లు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం అండగా ఉంటుంది

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

పాత మంచిర్యాలలో 45 గొర్రెలను కోల్పోయిన బాధితుడికి రూ.1.25 లక్షల నష్టపరిహారం చెక్కు అందజేత



**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత మంచిర్యాలలో ఇటీవల గుర్తు తెలియని అటవీ జంతువు దాడిలో 45 గొర్రెలను కోల్పోయిన గొర్రెల యజమాని పొనవేణి రాజబాపు తన సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1 లక్ష 25 వేల నష్టపరిహారం మంజూరు చేయించారు. అనంతరం బాధితుడికి నష్టపరిహారం చెక్కును ఎమ్మెల్యే స్వయంగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం**



**ఖానాపూర్ జూలై 13( ప్రజా జ్యోతి)** నిర్మల్ జిల్లాలో ప్రజలు తమ సమస్యల కోసం సమర్పించిన ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువు లేక.. నకిలీ విత్తనాల భయంతో రైతు కన్నీరు

**అధిక ధరలు, అధికారుల నిర్లక్ష్యం... వ్యవసాయమే భారంగా మారుతోందా?**




**ఆసిఫాబాద్ జులై 13 ప్రజా జ్యోతి** వానలు పడ్డాయి. పొలాలు దుక్కి అయ్యాయి. కానీ రైతు ముఖంలో మాత్రం సంతోషం లేదు. చేతిలో డబ్బు లేదు, బ్యాగ్లో ఎరువు లేదు. దుకాణంలో ఉంటే ధర ఆకాశాన్ని తాకుతోంది. ఇదీ ఈ ఏడాది కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రైతు పరిస్థితి. యూరియా, డిఏపి దొరకడం లేదు... దొరికినా రెట్టింపు ధర సీజన్ పీక్లో ఉంది. వరి, సోయా పంటలకు యూరియా, డిఏపి తప్పనిసరి. కానీ జిల్లాలోని చాలా మండలాల్లో ఎరువుల దుకాణాల ముందు క్యూలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ?200 నుంచి ?400 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. "అడిగితే స్టాక్ లేదంటారు. లేదంటే బిల్లు లేకుండా ఎక్కువ రేటుకు ఇస్తున్నారు. ఎవరిని అడగాలి?" అని ఓ రైతు కన్నీరు పెట్టుకున్నాడు.

**పై నుంచి నకిలీ విత్తనాల భయం**

ఎరువుల కష్టం ఒకవైపు ఉంటే, నకిలీ విత్తనాల భయం మరోవైపు వెంటాడుతోంది. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్ముతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గత ఏడాది నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులు ఈసారి భయంతోనే విత్తనం కొంటున్నారు.

**అధికారులు ఏం చేస్తున్నారు?**

ఇన్ని జరుగుతున్నా జిల్లా వ్యవసాయ అధికారులు మాత్రం కళ్లు మూసుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మార్కెట్లలో తనిఖీలు లేవు, దాడులు లేవు. ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ తీవ్రంగా స్పందించారు. "జిల్లాలో యూరియాతో పాటు డిఏపి కూడా అధిక ధరలకు అమ్ముతున్నా వ్యాపారస్తులను ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాలతో రైతులు భయాందోళనలో ఉన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టడంలో జిల్లా వ్యవసాయ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వారి నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తోంది. వెంటనే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నాం" అని దుర్గం దినకర్ అన్నారు.

**రైతే రాజు అంటారు... కానీ?**

ప్రభుత్వాలు రైతు సంక్షేమం గురించి పెద్ద పెద్ద మాటలు చెబుతాయి. కానీ చేలోకి వచ్చేసరికి రైతుకు మిగిలేది అప్పు, ఆందోళన, అధికారుల నిర్లక్ష్యం మాత్రమే. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం కళ్లు తెరిచి, కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై, నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందా? లేదా రైతు ఇలాగే కన్నీరు పెట్టుకోవాల్సిందేనా? అనేది ప్రశ్న

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**పాఠశాలలు, అంగన్వాడీల్లో పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ**



**ఆసిఫాబాద్ జులై 13 ప్రజా జ్యోతి** జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఏఏఎం బెండారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించారు.

**డాక్టర్ వినయ్ మాట్లాడుతూ...**

బంబారా ఆశ్రమ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ వినయ్ పాల్గొని మాట్లాడారు. "1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల పిల్లలు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్ర వేసుకోవాలి. నులిపురుగులు మూడు రకాలు. అవి నులిపురుగులు, ఎలికపురుగులు, కొంకిపురుగులు. ఇవి వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల శుభ్రత పాటించకపోవడం వల్ల వస్తాయి" అని అన్నారు. "మరుగుదొడ్డికి వెళ్లిన తర్వాత, భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. నిర్లక్ష్యంగా ఉంటే ఈ పురుగులు నోటి ద్వారా కడుపులోని పేగుల్లో చేరి, మనం తినే పోషకాహారాన్ని అవి తినేస్తాయి. దీని వల్ల పిల్లలు రక్తహీనతకు గురవుతారు. కడుపులో పురుగులు ఉన్న పిల్లలకు వాంతులు, తలనొప్పి, విరేచనాలు, రక్తహీనత వస్తాయి. చదువుపై కూడా ఏకాగ్రత ఉండదు" అని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి రవిదాస్, డాక్టర్ రియాజ్, ఎంఎల్హెచ్పి, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నకుమారి, ఏఎన్ఎం సునంద తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ



**రామకృష్ణాపూర్,జులై 13(ప్రజా జ్యోతి):** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సూపర్‌బజార్ సెంటర్‌లో మీసాల సతీష్‌కుమార్ 40వ జన్మదినం సందర్భంగా పది మంది నిరుపేదలకు 25 కిలోల బియ్యం, మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. జంతు ప్రేమికుల సంఘం అధ్యక్షుడు గంధం బాబురావు, పూల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి, డాక్టర్ రాజా రమేష్ పాల్గొని నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేశవరపు సత్య వెంకట్, నిమ్మల సంతోష్‌రెడ్డి, హర్షరెడ్డి, మేడిపల్లి రోహిత్‌రెడ్డి, మీసాల కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు పవర్ కమిటీ వేతనాలు వెంటనే అమలు చేయాలి

**సింగరేణి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఐఎఫ్‌టీయూ వినతి**



**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ సిఫార సు చేసిన వేతనాలను వెంటనే అమలు చేయాలని, సింగరేణి పరిరక్షణతో పాటు మణుగూరు ప్రాంత మనుగడకు అవసరమైన గనులను సంస్థకు కేటాయించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ (ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) మణుగూరు ఏరియా నాయకులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ మణుగూరు ఏరియా అధ్యక్షుడు ఏ. మంగీలాల్ మాట్లాడుతూ, తాటిచర్ల గనిని సింగరేణికి కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా మణుగూరు ప్రాంత అభివృద్ధి, ఉపాధి అవకాశాల పరిరక్షణ కోసం పీకేఓసీ డిప్ సైడ్ గనిని కూడా సింగరేణికి కేటాయించాలని కోరారు. సింగరేణి వ్యాప్తంగా వివిధ గనులు, విభాగాల్లో సుమారు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, ఓబీ వర్కర్లు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఉత్పత్తి, ఉత్పాదకతలో శాశ్వత కార్మికులతో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ, తగిన వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రంలో హై పవర్ కమిటీ వేతనాలను వెంటనే అమలు చేయడంతో పాటు, సింగరేణి క్యాంటీన్లలో టీ, టిఫిన్, భోజనాలకు కాంట్రాక్ట్ కార్మికులకు బడ్జెట్ కేటాయించాలని, ఈఎస్ఐ వైద్య సేవలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, విధి నిర్వహణలో జరిగే ప్రమాదాలతో పాటు సహజ మరణం, విధులకు వెలుపల జరిగే ప్రమాదాలకు కూడా ప్రమాద బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత ఎల్లాపూర్ హైస్కూల్ విద్యార్థులకు నులి పురుగుల మందుల పంపిణీ

సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి



**ఖానాపూర్ జూలై 13 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ హైస్కూల్లో విద్యార్థులకు నోళి పురుగుల మందును సర్పంచ్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు భవిష్యత్తులో పిల్లలకు అనారోగ్యంతో సోకకుండా ఈ మాత్రలు వేస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆసురి రమాదేవి ఏఎన్ఎం గంగమణి తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలే నాణ్యమైన విద్యకు పునాది

అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య





**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఓల్డ్ మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర ఇన్సర్వీస్ ఉపాధ్యాయుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన బెల్లంపల్లి మండల విద్యాధికారి (ఎంఈఓ), ప్రాజెక్టు కోఆర్డినేటర్లతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడిన అదనపు కలెక్టర్, శిక్షణలో బోధిస్తున్న అంశాలు, అభ్యాస బోధన విధానాలు, తరగతి గదిలో వాటి అమలు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలతో పాటు విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకతను పెంపొందించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం శిక్షణ నిర్వహణ, హాజరు, శిక్షణా సామగ్రి, తరగతి నిర్వహణను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమాలు లక్ష్యోద్దేశ్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించబడేలా చర్యలు తీసుకోవాలని, శిక్షణ అనంతరం బోధనా విధానాల అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మండల విద్యాధికారి (ఎంఈఓ), ప్రాజెక్టు కోఆర్డినేటర్లు, మాస్టర్ ట్రైనర్లు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్య రక్షణే లక్ష్యం.. ఆల్బెండాజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ



**ఆసిఫాబాద్ జూలై 13 ప్రజా జ్యోతి** జాతీయ నులిపురుగుల నివా రణ దినోత్సవం సందర్భంగా వాంకిడి మండలంలోని ఏఏఎం బెండారా పీహెచ్సీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండాజోల్ 400 మి.గ్రా. ట్యాబ్లెట్లను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది నులిపురుగుల నివారణతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, గోళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోరహార్లే రమేష్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు

## స్త్రీనిధి రుణాల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలి

సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్



**ఖానాపూర్ జూలై 13( ప్రజా జ్యోతి)**ఖానాపూర్ మండలంలో నిగోసంపల్లి, పాత ఎల్లాపూర్ గ్రామాల్లో స్త్రీనిధి స్వయం సహాయక సంఘాల రుణాల రికవరీలో చోటుచేసుకున్న అక్రమాలు, డ్వాక్రా గ్రూపు నిధుల దుర్వినియోగానికి సంబంధించిన అంశాలు వివిధ పత్రికల్లో రావడం ఆందోళన కలిగిస్తోందని సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక తనిఖీల్లో లక్షల రూపాయల నిధుల దుర్వినియోగం జరిగినట్లు బయటపడటం, వరుసగా ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడం స్వయం సహాయక సంఘాల నిర్వహణలో ఉన్న లోపాలను బయటపడుతుంది. మహిళా సంఘాల సభ్యులు కష్టపడి చెల్లించిన సొమ్ము గమ్యానికి చేరకుండా దుర్వినియోగం కావడం అత్యంత బాధాకరమని, ఈ వ్యవహారంలో క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంబంధిత అధికారుల పాత్రపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులైన అధికారులు, సిబ్బంది, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు దుర్వినియోగమైన నిధులను పూర్తిగా రికవరీ చేసి బాధిత మహిళా సంఘాలకు తిరిగి అందజేయాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రుణాల రికవరీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాల సభ్యుల విశ్వాసాన్ని కాపాడేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజాధనం వృథా కాదు: నాణ్యతతోనే అభివృద్ధి

- సర్పంచ్ పోచయ్య



**ఆసిఫాబాద్ జూలై 13 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తున్నామని, ప్రజాధనం వృథా కాకుండా చూసే బాధ్యత తమపై ఉందని రాజంపేట సర్పంచ్ బుర్సా పోచయ్య అన్నారు.గ్రామపంచాయతీ పరిధిలోని జూబ్లీ మార్కెట్ సమీపంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం సర్పంచ్, అధికారులతో కలిసి పరిశీలించారు నిర్మాణం పూర్తయి వారం రోజులు కావడంతో రోడ్ల బలానికి అవసరమైన క్యూరింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీసీ రోడ్లు మన్నికగా ఉండాలంటే... సీసీ రోడ్లు దీర్ఘకాలం మన్నికగా ఉండాలంటే నిర్మాణం అనంతరం నిరంతరం నీరు పోయడం తప్పనిసరని సర్పంచ్ పేర్కొన్నారు. క్యూరింగ్ సక్రమంగా జరుగుతుందా లేదా అని పరిశీలించి, అవసరమైన చోట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు."ప్రజల సొమ్ముతో చేసే ప్రతి పనిని పారదర్శకంగా, నాణ్యతతో చేయడమే మా లక్ష్యం. పని పూర్తయిన తర్వాత కూడా పర్యవేక్షిస్తూ, ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగించేలా అభివృద్ధిని కొనసాగిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుల ఫోరం జిల్లా అధ్యక్షులు గులాం జావిద్, గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ నాగేంద్ర, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరం

- సర్పంచ్ పోచయ్య



**ఆసిఫాబాద్ జూలై 13 ప్రజా జ్యోతి** కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని రాజంపేట సర్పంచ్ బుర్సా పోచయ్య అన్నారు.గ్రామపంచాయతీ పరిధిలో లేబర్ హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సోమవారం కార్మికుల కోసం ప్రత్యేక ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కార్మికులకు రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, షుగర్ పరీక్షలతో పాటు ఇతర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్సా పోచయ్య, వార్డ్ సభ్యుల ఫోరం జిల్లా అధ్యక్షులు గులాం జావిద్, గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ నాగేందర్, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు లేబర్ హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ, రాజంపేట గ్రామపంచాయతీ ప్రజల ఆరోగ్యం, కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలను భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు

# "ప్రజావాణి" దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లాలో "ప్రజావాణి" కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు. ఈ సందర్భంగా తాండూరు మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన బోయిని శ్రీనివాస్ తాను ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్నానని, తన ఇంటి నంబర్ మార్పు కోసం అనుసరించాల్సిన విధానాన్ని తెలియజేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చీకటి కిషోర్ కుమార్ గౌడ్ గ్రామపంచాయతీ మురుగు కాలువపై అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చెన్నూర్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన నిట్టూరి మధుకర్ తన తాతకు చెందిన ఆస్తిని తనకు తెలియకుండా పట్టా మార్పిడి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే నిలిపివేసి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. మందమర్రి మండలం చిర్రకుంట గ్రామ రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లే ప్రభుత్వ దారిని కొందరు ఆక్రమించారని, ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ దారిని పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు. దరఖాస్తులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 52 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

**గొర్రెల యజమానికి రూ.1.25 లక్షల నష్టపరిహారం చెక్కు.....**

అనంతరం గత వరదల సమయంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో వరద నీటికి కొట్టుకుపోయి మృతి చెందిన గొర్రెలకు సంబంధించి, గొర్రెల యజమాని పొనవేని రాజబాబుకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1,25,000 నష్టపరిహారం చెక్కును జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

**తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు సాధన సమితి నాయకులు**

**జూలై 16న తుమ్మిడిహెట్టి బ్యారేజ్ స్థలం వద్ద జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు**



**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్ల లోని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని, జూలై 16న ఉదయం 10:30 గంటలకు ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజ్ స్థలం వద్ద నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు సాధన సమితి నాయకులు పిలుపునిచ్చారు. సమితి ప్రతినిధులు సోమవారం మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం ప్రారంభమైన నాలుగేళ్లకే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునాదుల్లో ప్రతి ఏడాది సమస్యలు తలెత్తడం ఆందోళన కలిగించే అంశమన్నారు. పునాదుల్లో గ్రౌటింగ్ చేసినప్పటికీ సమస్యలు మళ్లీ మళ్లీ వస్తున్నాయని, పూర్తి పునర్నిర్మాణం జరిగే వరకు ఈ బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయరాదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు .ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో వరి సాగు గణనీయంగా తగ్గిపోయిందని, మెట్ట పంటలకు సాగునీరు అందడం లేదని, వేసిన విత్తనాలు కూడా మొలకెత్తని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎగువ, మధ్య గోదావరిలో నీటి లభ్యత తగ్గిపోగా, కృష్ణా నదిలో కూడా నీటి కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసే డిమాండ్లు వినిపిస్తున్నాయని, ప్రస్తుతం బ్యారేజీల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అలాంటి చర్యలు భవిష్యత్తులో ప్రమాదాలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన జాప్యం కూడా ప్రస్తుత నీటి సంక్షోభానికి ఒక కారణమని పేర్కొన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జూలై 16న తుమ్మిడిహెట్టి బ్యారేజ్ స్థలం వద్ద నిర్వహించే కార్యక్రమానికి రైతులు, ప్రజాసంఘాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సమితి విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశం లో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు టి. శ్రీనివాస్, తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్, సీపీఐ జిల్లా నాయకుడు కలిందర్ ఖాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రకాష్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్ కుమార్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టి. శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ నాయకుడు దొండ ప్రభాకర్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమన్లు, సురేందర్, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులకు భయపడేది లేదు

**ప్రజల పక్షాన పోరాటం కొనసాగుతుంది:బీఆర్ఎస్ నేతలు**



**జైపూర్ జులై 13 ప్రజాజ్యోతి** కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపుతో కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.కేసు విచారణలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ అడ్వకేట్ మల్లేశం గౌడ్‌తో కలిసి జైపూర్ మండలంలోని టేకుమట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం చెన్నూర్ కోర్టుకు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కేసులతో తమను భయపెట్టడం సాధ్యం కాదన్నారు.ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తూ ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న తమపై కక్షసాధింపు చర్యలు చేపట్టడం సరికాదని పేర్కొన్నారు. ఎన్ని ఒత్తిళ్లు అక్రమ కేసులు ఎదురైనా ప్రజల పక్షాన తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## బీసీ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం

**ఎస్ఆర్పీ-3 గని బీసీ అసోసియేషన్ పిట్ కమిటీ**

**నూతన నాయకత్వం ఏర్పాటు**



**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లా శ్రీరాం పూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-3 గని ఆవరణలో సోమవారం సింగరేణి బీసీ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిట్ కమిటీ సమావేశం నిర్వహించారు. బదిలీపై వెళ్లిన అధికారుల స్థానంలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు బీసీ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, పదోన్నతులు, సంక్షేమ సౌకర్యాల సాధనతో పాటు బీసీ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసి ఉద్యోగుల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో నూతన పిట్ కమిటీకి కాపు అరుణ్ కుమార్ (డిప్యూటీ సర్వేయర్)ను చీఫ్ అడ్వైజర్‌గా, పూర్ణచందర్ (సీనియర్ అండర్ మేనేజర్)ను అడ్వైజర్‌గా, రాసకట్ల శ్రవణ్ (మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ)ను అడ్వైజర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ముస్కె సమ్మయ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజి సైదా, బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి బారపాటి మారుతి, ఎస్ఆర్పీ-3 బీసీ పిట్ కార్యదర్శి మనోహర్, మురళి చౌదరి, అంబాల రవి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం నూతనంగా ఎన్నికైన పిట్ కమిటీ సభ్యులను సంబంధిత గని మేనేజర్‌కు పరిచయం చేసి, బీసీ ఉద్యోగుల సంక్షేమం, అభ్యున్నతికి యాజమాన్యం పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంఘం బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ -- శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# విజయవంతంగా ముగిసిన సింగరేణి అధికారుల 15 రోజుల రిలే నిరాహార దీక్షలు

### రెండు నెలల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ హామీ
### సీఎం, డిప్యూటీ సీఎంకు సి.ఎం.ఓ.ఏ.ఐ. కృతజ్ఞతలు



**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 15వ రోజుకు చేరాయి. సింగరేణి అధికారుల సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల సాధన కోసం సింగరేణి అధికారుల సంఘం (సీఎంఓఏఐ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం వద్ద కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 15వ రోజు దీక్షలో అదనపు మేనేజర్ (ఎస్టేట్స్) వి. మహేష్, డిప్యూటీ మేనేజర్ (ఐకే-1ఏ ఇంక్లైన్) జి. అనిల్, డిప్యూటీ మేనేజర్ (ఐకే-1ఏ ఇంక్లైన్) ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, సర్వే ఆఫీసర్ (ఎస్ఆర్పీ-ఓసీ) తిరుపతి, జూనియర్ సర్వే ఆఫీసర్ (ఆర్కే-5 ఇంక్లైన్) కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, తమ న్యాయమైన డిమాండ్లైన పెండింగ్‌లో ఉన్న పీఆర్పీ బకాయిల చెల్లింపు, ప్రమోషన్లలో జాప్యం నివారణ, అధికారుల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు. దీక్షా శిబిరానికి పలువురు అధికారులు సంఘీభావం ప్రకటించి, దీక్షలో పాల్గొన్న వారికి మద్దతు తెలిపారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో క్రమశిక్షణతో నిరసన కార్యక్రమాలు, రిలే నిరాహార దీక్షల్లో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్క అధికారికి రిలే నిరాహార దీక్షల చివరి రోజు అయిన సోమవారం సి.ఎం.ఓ.ఏ.ఐ. సింగరేణి శ్రీరాంపూర్ శాఖ నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం శ్రీరాంపూర్‌లో సంఘం నాయకులు మాట్లాడుతూ, అధికారుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించి రెండు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం సంతోషకరమైన పరిణామమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీపై పూర్తి విశ్వాసం ఉందని, నిర్ణీత గడువులో సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ గడువులోగా సమస్యలు పరిష్కారం కాకపోతే సభ్యులతో చర్చించి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. అధికారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కోల్‌బెల్ట్ ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు సి.ఎం.ఓ.ఏ.ఐ. సింగరేణి శాఖ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉద్యమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలిపిన ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులు, ప్రతి ఒక్క అధికారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను 100% పూర్తి చేసిన బిఎల్ఓ లకు అధికారులతో కలిసి సన్మానం

-బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్ కుమార్.



**సోనాల, జులై 13 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండలం లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ 100% పూర్తి చేసిన ఘనపూర్,వజ్జర్ మహద్గాడ,టివిటి జైతు గూడ గ్రామాల్లోని బి ఎల్ ఓ లను ఎమ్మార్వో మల్లేష్ గారితో కలిసి గూడల అనీష్ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మల్లేష్ మాట్లాడుతూ బి ఎల్ ఓ ల కృషి వల్లనే ఇది సాధ్యమైనదని మిగతా బిఎల్ఓ లు కూడా మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొని వాళ్ళు కూడా తొందరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని తెలియచేసారు. ఈ రోజుతో సోనాల మండలంలో ఎస్ ఐ ఆర్ దాదాపు 70 % పూర్తవుతుందని మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియను విజయవంతంగా 100% పూర్తి చేస్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమం లో డిటి ప్రేమ్ నివాస్, బిఎల్ఓ లు మరియు మద్దెల మహేష్ తదితరులు ఉన్నారు.

## వినాయక చవితికి మట్టి వినాయకులే పూజించేలా చర్యలు తీసుకుంటాం

ప్రకృతి మిత్ర వినతిపై సానుకూలంగా స్పందించిన సింగరేణి జి.ఎం మునిగంటి శ్రీనివాస్



**మంచిర్యాల, 13, జూలై (ప్రజాజ్యోతి):** రాబోయే వినాయక చవితి సందర్భంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు విత్తన బంతులతో తయారు చేసిన బంకమట్టి ప్రకృతి సిద్ధమైన వినాయక విగ్రహాలనే పూజించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రకృతి మిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గుండేటి యోగేశ్వర్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలుస్తున్న సింగరేణి శ్రీరాంపూర్ యాజమాన్యం విత్తన బంతులతో తయారైన బంకమట్టి వినాయక విగ్రహాలను కార్మికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇలా చేస్తే వినాయక నిమజ్జనం అనంతరం విగ్రహాల్లోని విత్తనాలు మొలకెత్తి వేలాది మొక్కలు పెరిగే అవకాశం ఉంటుందని, తద్వారా వృక్ష సంపద పెరగడంతో పాటు జలవనరుల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ కాలుష్య నివారణకు దోహదపడుతుందని తెలిపారు. ప్రకృతి మిత్ర ప్రతిపాదనపై స్పందించిన శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్, పర్యావరణహిత వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు సింగరేణి తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పర్యావరణ విభాగం అధికారి హనుమాన్ గౌడ్, ప్రకృతి మిత్ర సభ్యులు, పీసీబీ కుమ్మరి వృత్తి కళాకారుడు రాజేంద్ర ప్రసాద్, బి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సంఘాల స్వచ్ఛంద కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి

ఆసిఫాబాద్ మండల సమైక్య కార్యాలయ అధికారికి వినతిపత్రం



**ఆసిఫాబాద్ జులై 13 ప్రజా జ్యోతి** గ్రామ సంఘాల స్వచ్ఛంద కార్యకర్తలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ మండల సమైక్య కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా గ్రామస్థాయిలో స్వచ్ఛంద కార్యకర్తలుగా పనిచేస్తున్న మహిళలు ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే స్వచ్ఛంద కార్యకర్తలకు 18 వేల రూపాయల వేతనం, భవిష్య నిధి, ఆరోగ్య బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు, 10 లక్షల సాధారణ ఆరోగ్య బీమా, ట్యాబ్ మరియు అంతర్జాల సౌకర్యం, ఆదాయం లేని సంఘాలకు 20 లక్షల ప్రత్యేక నిధి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటివరకు ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆరోపించారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాం" అని రాజేందర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సంఘాల స్వచ్ఛంద కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్దు, వినోద్, గణేష్, జె. వినోద్, అర్చన, పద్మ, రమాదేవి, అంజలి, సంజీవ్, ప్రభాకర్, ఓమాజీ, ప్రమోద్, కవిత, రాధా, ఫర్జానా తదితరులు పాల్గొన్నారు

## ఈదులవాడలో వీఓ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ఆసిఫాబాద్, జూలై 13 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలో వీఓ (విలేజ్ ఆర్గనైజేషన్) నూతన భవన నిర్మాణానికి ఇంచార్జి అజ్మీర్ శ్యాంనాయక్ స్థానిక సర్పంచ్‌తో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళ్యాణి సతీష్, ఉపసర్పంచ్, వార్డు సభ్యురాలు ఇరుకుల్లా మంగ, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, ఆత్మ కమిటీ చైర్మన్ గడ్డల సత్తయ్య, మాజీ ఎంపీటీసీలు కాశయ్య, గాదవేణి మల్లేష్, మారిశెట్టి రమేష్, నిజాం సంతోష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


# తాడిచర్ల-2తో సింగరేణికి సుస్థిర భవిష్యత్‌కు నాంది

కార్మికుల చెమటే సింగరేణి అసలైన బలం.. ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

డిప్యూటీ సి ఎం భావోద్వేగపూరిత బహిరంగ లేఖ విడుదల

**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడం సింగరేణి చరిత్రలో అత్యంత కీలకమైన మైలురాయిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అభివర్ణించారు. తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాల సందర్భంగా సింగరేణి కార్మికులను ఉద్దేశించి ఆయన సోమవారం భావోద్వేగపూరిత లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా సింగరేణి అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం చేపట్టిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణ, కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వ నిబద్ధతను ఆయన వివరించారు. భట్టి విక్రమార్క తన లేఖలో మాట్లాడుతూ,ప్రజా ప్రభుత్వం అవిశ్రాంత కృషి ఫలితంగానే 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలుకుతూ తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు లభించిందన్నారు. ఇది సింగరేణి సుస్థిర భవిష్యత్తుకు బాటలు వేసిన చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. విజయోత్సవాల్లో ప్రత్యక్షంగా పాల్గొని కార్మికులతో ఆనందాన్ని పంచుకోవాలని ఎంతో ఆశించినప్పటికీ అనివార్య కారణాలతో హాజరు కాలేకపోయానని తెలిపారు. 137 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన సింగరేణి తనకు అత్యంత ఆత్మీయమైన సంస్థ అని, సింగరేణి కేవలం బొగ్గు తవ్వే సంస్థ మాత్రమే కాదని, లక్షలాది కుటుంబాలకు జీవనాధారం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక, దక్షిణ భారతదేశ ఇంధన భద్రతకు మూలస్తంభమని అన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా బొగ్గు గనులను సందర్శించి కార్మికుల కష్టం, చెమట, వారి కుటుంబాల త్యాగాన్ని ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. అప్పుడే సింగరేణిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసి కార్మికుల సంక్షేమానికి అండగా నిలవాలని సంకల్పించానన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్థిక, ఇంధన శాఖ బాధ్యతలు చేపట్టినప్పటికీ తన ఆలోచనల్లో ఎల్లప్పుడూ సింగరేణే ఉందని, సంస్థకు మరో వెయ్యేళ్ల ఉజ్వల భవిష్యత్తు కల్పించాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణి కార్మికులకు రూ.1 కోటి ప్రమాద బీమా పథకాన్ని అమలు చేసి వారి కుటుంబాలకు భరోసా కల్పించామని గుర్తుచేశారు. అంతేకాకుండా సంస్థ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త బొగ్గు బ్లాకుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల వల్ల సింగరేణి అనేక బంగారు అవకాశాలను కోల్పోయిందని భట్టి ఆరోపించారు. ఆ పరిస్థితిని మార్చేందుకు బొగ్గు గనుల వేలంలో సింగరేణి ధైర్యంగా పాల్గొనేలా ప్రోత్సహించామని, భవిష్యత్ తరాలకు బలమైన సంస్థను అందించాలంటే కొత్త బొగ్గు గనులను సమకూర్చుకోవడం తప్పనిసరి అని యాజమాన్యానికి స్పష్టం చేశామని తెలిపారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గని అనుమతులు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో దాదాపు తొమ్మిదేళ్ల పాటు పెండింగ్‌లో ఉన్నాయని, తానే స్వయంగా ఒడిశాకు వెళ్లి అక్కడి ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలతో చర్చించి అనుమతులు సాధించానని తెలిపారు. నేడు నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైందని, ఇది సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ విషయాన్ని ప్రస్తావిస్తూ... 2013లోనే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించినప్పటికీ మైనింగ్ లీజు లభించక దాదాపు 11 సంవత్సరాలు వృథా అయ్యాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నామని చెప్పారు. 2024 మార్చిలో అప్పటి కేంద్ర బొగ్గు,


సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్

తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాల సందర్భంగా సింగరేణి కార్మికులకు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రివర్యులు


శ్రీ భట్టి విక్రమార్క గారి సందేశం

ప్రియమైన సింగరేణి కార్మిక సోదర సోదరీమణులారా...

గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి ఈ అంశాన్ని బలంగా ప్రస్తావించానని, అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి ప్రధానమంత్రి, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి లీజు మంజూరు చేయాలని కోరినట్లు వివరించారు. ఆ నిరంతర ప్రయత్నాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజును మంజూరు చేసిందన్నారు. అయితే నైనీతో గానీ, తాడిచర్లతో గానీ తమ ప్రయాణం ముగిసిపోదని, ఇది కేవలం ఆరంభమేనని స్పష్టం చేశారు. గోదావరి లోయలో సింగరేణికి న్యాయంగా రావాల్సిన ప్రతి బొగ్గు బ్లాక్ కోసం ఇదే పట్టుదలతో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. సింగరేణి ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, సంస్థను కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థగానే కాకుండా పునరుత్పాదక ఇంధన రంగం, క్రిటికల్ మినరల్స్, ఆధునిక సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ తో ముందుకు సాగుతోందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రైవేట్ సంస్థలతో పోటీపడే స్థాయికి సింగరేణిని తీసుకెళ్లాలంటే బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాలు భుజం భుజం కలిపి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం సింగరేణికి మరో స్వర్ణయుగాన్ని తీసుకురావాలనే సంకల్పంతో ఉందని, అందరూ అందుకు భాగస్వాములు కావాలని కోరారు. “మీ చెమట చుక్కలతో నిర్మితమైన ఈ మహోన్నత సంస్థను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే బాధ్యత మీది, మాది, మనందరిదీ. మీ శ్రమ, మీ నిబద్ధత, మీ క్రమశిక్షణ, మీ అంకితభావమే సింగరేణికి అసలైన బలం. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటుంది. మీ సంక్షేమం మా బాధ్యత. సంస్థ అభివృద్ధి మీ బాధ్యత. మనమంతా కలిసి నడిస్తే సింగరేణికి మరింత ఉజ్వల భవిష్యత్తు ఖాయమవుతుంది” అని భట్టి విక్రమార్క అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రైవేటు పరమైన కోయగూడెం బ్లాక్, సత్తుపల్లి బ్లాక్‌తో పాటు మరిన్ని బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికి తీసుకురావడానికి రానున్న రోజుల్లో ఇదే పట్టుదలతో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చివరగా “మనమందరం కలిసి పని చేద్దాం... సింగరేణిని మరింత బలోపేతం చేద్దాం... మన శ్రమ శక్తిని ప్రపంచానికి చాటుదాం... జై సింగరేణి” అంటూ సింగరేణి కార్మికులకు భట్టి విక్రమార్క తన సందేశాన్ని ముగించారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి”

నూతన ఎస్సై సుధాకర



**కేరమేరి జులై 13 ప్రజా జ్యోతి** కెరమెరిమండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కెరమెరి నూతన ఎస్సై సుధాకర్ పిలుపునిచ్చారు.ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సుధాకర్‌ను శ్రీ పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి అధ్యక్షుడు పెందోర్ శ్రీనివాస్ సోమవారం పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సేవా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలను ఎస్సైకు వివరించారు.యువత సమాజ సేవలో ముందుండాలి ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ, సేవా సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. సమాజ సేవలో యువత చురుగ్గా పాల్గొని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రజలు మరియు పోలీసులు కలిసి పనిచేస్తేనే నేరాలను అరికట్టవచ్చని, శాంతి భద్రతలను కాపాడవచ్చని తెలిపారు.

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రికి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల వినతి

కనీస పెన్షన్ రూ.15 వేలు, హెల్త్ ఇన్సూరెన్స్ రూ.25 లక్షలకు పెంచాలి



**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సోమవారం నిర్వహించిన సింగరేణి బొగ్గు గనుల భరోసా యాత్ర సందర్భంగా కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తమ ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం తరఫున బాధ్యులు కొల్లు నాగేశ్వరరావు, బీఎంఎస్ మాజీ అధ్యక్షుడు చింతల సూర్యనారాయణ, విశ్రాంత అధికారి సామ్య తదితరులు మంత్రిని కలిసి, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల కనీస పెన్షన్‌ను ప్రస్తుతం ఉన్న స్థాయి నుంచి రూ.15 వేలుగా నిర్ణయించాలని, అలాగే ఉద్యోగులకు అమలులో ఉన్న హెల్త్ ఇన్సూరెన్స్ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని కోరారు. అదే సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె. అరుణ, జిల్లా అధ్యక్షుడు బి. ప్రభాకర్ రెడ్డి తదితర నాయకులకు కూడా ఇదే అంశాలపై వినతిపత్రాలను అందజేసి, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు కోరుట్ల గురుమూర్తి, అంజనానందం, రాజేంద్ర ప్రసాద్, శివరామకృష్ణ, ఎస్. రామచంద్రరావు, ధర్మారావు, అక్కినేని మురళీకృష్ణ, విజయ మోహన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై కూడా చర్చించారు.

# సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలు సకాలంలో నమోదు చేయాలి

## మహిళలపై నేరాలు, గ్రేవ్ కేసుల్లో అలసత్వం వద్దు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

### పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా నాణ్యమైన దర్యాప్తు చేయాలి





**మంచిర్యాల, 13,జూలై (ప్రజాజ్యోతి):** సీసీటీఎన్ఎస్ 2.0లో నమోదయ్యే ప్రతి కేసు వివరాలను నిర్దేశిత గడువులోగా అప్‌డేట్ చేయాలని, పెండింగ్ కేసులను సత్వరమే పూర్తి చేసి నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో సీపీ అంబర్ కిషోర్ ఝా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఆన్‌లైన్‌లో సమీక్షించారు. స్టేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పెండింగ్ కేసుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న లాంగ్ పెండింగ్, పాత కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో నమోదైన ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని నిర్ణీత కాలవ్యవధిలో తప్పనిసరిగా నమోదు చేయాలని, ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్, ఎన్సీఆర్‌బీ నివేదికలు, ఎన్‌టీఆర్ ఫోటో డేటాబేస్‌తో పాటు ఇతర డిజిటల్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి దశను నిర్ణీత సమయంలో సిస్టమ్‌లో నమోదు చేయాలని, తప్పుడు లేదా అనవసర సమాచారాన్ని అప్‌లోడ్ చేయరాదని హెచ్చరించారు. ప్రతి కేసును గడువులోగా పూర్తి చేసి నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాపర్టీ నేరాలు చైన్ స్నాచింగ్ కేసుల్లో స్థానిక పోలీసులు, సీసీఎస్ బృందాలు సమన్వయంతో పనిచేసి నిందితులను త్వరగా పట్టుకోవాలని ఆదేశించారు. మహిళలకు సంబంధించిన తీవ్రమైన కేసుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, వెంటనే కేసు నమోదు చేసి సీసీటీఎన్ఎస్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. నిందితుల అరెస్టుల్లో జాప్యం ఉండరాదని స్పష్టం చేశారు. గ్రేవ్ కేసులు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరాల పెరుగుదలకు సంబంధించిన అంశాలు, పెండింగ్ కీలక నివేదికలను డీసీపీలు, ఏసీపీలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పేకాట తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఆస్తి, ఆర్థిక నేరాల్లో ఆస్తుల గుర్తింపు, స్వాధీనం, అటాచ్‌మెంట్ ప్రక్రియలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, కేడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, ప్రాపర్టీ ఆఫెండర్లపై పూర్తి సమాచారం ఎస్‌హెచ్‌వోలకు ఉండాలని, వారి కదలికలు, కార్యకలాపాలు, సంబంధాలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఫంక్షనల్ వర్టికల్స్‌లో అధికారులు సమన్వయంతో పనిచేస్తే రాష్ట్ర స్థాయిలో పోలీస్ స్టేషన్లకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరిధిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులో క్రిమినల్ అంశాలు ఉంటే వెంటనే కేసు నమోదు చేసి పారదర్శకంగా విచారణ నిర్వహించాలని, సాక్ష్యాధారాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ దేవాలయంతో సమానమని, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, ఏ సంఘటన జరిగినా వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిర్ధారించి పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. అరెస్టుల విషయంలో ఎస్‌ఓపీని తప్పనిసరిగా పాటించాలని, పోలీసుల ప్రవర్తనే శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వవద్దని సీపీ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ సి. హెచ్. శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, రమేష్‌తో పాటు సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## లుంబిని దీక్ష భూమిలో షెడ్ మంజూరు చేయాలి

### మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు కౌన్సిలర్ వినోద్ కుమార్ వినతి



**ఆసిఫాబాద్ జూలై 13 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ పట్టణంలోని లుంబిని దీక్ష భూమిలో భక్తుల సౌకర్యార్థం శాశ్వత షెడ్ నిర్మించాలని కోరుతూ ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం సమర్పించారు. దీక్ష భూమిలో ఏటా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని, ఈ సందర్భంగా భక్తులు, అనుచరులు వర్షం, ఎండ కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వినతిలో పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే శాశ్వత షెడ్ మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు స్పందిస్తూ, లుంబిని దీక్ష భూమి అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ అంశంపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే షెడ్ మంజూరు చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్ సర్వే సెంటర్లను సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక



**ఖానాపూర్ జూలై 13 (ప్రజా జ్యోతి )** కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్ 2026 సర్వే కార్యక్రమంలో భాగంగా పలు వార్డులలో సర్వే సెంటర్లను సందర్శించిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ప్రజలు ప్రతి ఒక్కరు అధికారులకు సహకరించి త్వరగా సర్వేపత్రాలను తిరిగి అందజేయాలని ఫారములు నింపని వాళ్లు సర్వే ఫారంను తీసుకొని సెంటర్ వద్దకు వెళ్తే అక్కడ అధికారులు సిబ్బంది నింపిస్తారని అన్నారు సమయం సమీపిస్తున్నందున ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు హక్కును కాపాడుకోవాలని మౌనిక అన్నారు ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది నాయకులు తదితరులు పాల్గొన్నారు

## తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపుతో మందమర్రి.

### ఏరియాలో సంబరాలు

### సింగరేణి భవిష్యత్తుకు ఇది కీలక మలుపు - జీఎం ఎన్. రాధాకృష్ణ.



**మందమర్రి, జూలై 13(ప్రజాజ్యోతి ):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను ప్రభుత్వం నేరుగా కేటాయించడంపై మందమర్రి ఏరియాలో సోమవారం ఘనంగా విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి జీఎం ఎన్.రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై సంబరాలను ప్రారంభించారు. అనంతరం ఏరియాలోని అన్ని గనులు, విభాగాలు, జీఎం కార్యాలయ యూనిట్లలో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పరస్పరం మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీఎం ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ కేటాయింపు సింగరేణి చరిత్రలోనే ఒక కీలక ఘట్టమని పేర్కొన్నారు. ఈ బ్లాక్‌తో సంస్థ సుస్థిర అభివృద్ధికి బలమైన పునాది పడిందని, భవిష్యత్తులో బొగ్గు ఉత్పత్తి పెరగడంతో పాటు ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమానికి ఇది ఎంతో దోహదపడుతుందని అన్నారు. సంస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఉద్యోగి, అధికారి, కార్మికుడు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొత్త బొగ్గు బ్లాక్ ద్వారా భవిష్యత్తు తరాలకు కూడా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయోత్సవాల్లో భాగంగా మందమర్రి ఏరియా పరిధిలోని అన్ని గనులు, కార్యాలయాల్లో మిఠాయిలు పంపిణీ చేసి పండుగ వాతావరణంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్య నారాయణ, సీఎంఓఏఐ ప్రతినిధి సరిత, డీజీఎం (పర్సనల్) సి. హెచ్. అశోక్, సీనియర్ పీఓ ఆర్. సత్యనారాయణ తో పాటు జీఎం కార్యాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును కాపాడుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ ఎస్ ఐ ఆర్ పరిశీలకులు కొట్నాక్ తిరుపతి**

**కాంగ్రెస్ పార్టీ కార్యాలయ స్థలం కోసం జిఓ విడుదలతో దశాబ్దాల కాంగ్రెస్ పార్టీ కార్య కర్తల కల నెరవేరింది**

**డీసీసీ డా నరేష్ జాదవ్**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 13, (ప్రజా జ్యోతి)** ప్రతి ఒక్కరూ తమ ఓటు హ క్కును కాపాడుకోవాలని కాం గ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ పరిశీల కులు, గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్ కొట్నాక్ తిరుపతి అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రి యను అదిలాబాద్ పట్టణంలో పలు వార్డులలో తిరిగి పరి శీలించిన ఆదిలాబాద్ నియో జకవర్గ ఎస్ఐఆర్ అబ్జర్వర్ కొట్నాక్ తిరుపతి సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నరే ష్ జాదవ్ మాట్లాడుతూ ఓటు హక్కు చాలా విలు వైందని కా బట్టి ప్రతి పౌరులు తమ ఓటు హక్కు కాపాడుకోవడం కోసం ఎన్యుమరేషన్ ఫామ్ సరిగ్గా నింపి బిఎల్ఓలకు అందించాలని తదనంతరం ఆన్ లైన్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేం ద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కా ర్యాలయం కోసం స్థలం కేటా యిస్తూ జీవో జారీ చేసినందు కు తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి, ముఖ్యమంత్రి సలహాదా రులు, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి కి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఇన్ని రోజులు కాంగ్రెస్ పార్టీకి కార్యాలయం లేకపోవడంతో అద్దె భవనాలలో నిర్వహించడం జరిగిందని ఇప్పటినుంచి ప్రజలకు మరింత అందుబాటులో ఉండడం కోసం వారి సమస్యలు తెలుసుకోవడం కోసం ఆ దిలాబాద్ అభివృద్ధి గురించి మరింత వేగంగాపనిచేయడం కోసం సొంత భవనం వల్ల అవకాశం లభిస్తుందని ఆయన అన్నారు. తదనంతరం రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఎస్ ఐఆర్ అబ్జర్వర్ తిరుపతి మా ట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదిలాబాద్ నియోజకవర్గంలోని నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించ డానికి పట్టణంలోని పలు వార్డులలోని పోలింగ్ బూత్ లలో పర్య టించడం జరిగిందని, ఈ సందర్భంగా ఓటు మ్యాపింగ్ పర్సంటేజ్ ని కనుక్కోవడం జరిగిందని, ప్రజలంతా తమకు ఇ చ్చిన ఎన్యు మరేషన్ ఫామ్ సరిగ్గా నింపి బిఎల్ఓలకు తొందరగా అందించేయా లని, సమయం చాలా తక్కువగా ఉందని, చివరి నిమిషంలో ఫారంలో అందరూ వెళ్లి బి ఎల్ ఓ లకి ఇస్తే ఆన్లైన్ ప్రక్రియలో సర్వర్లు పై లోడ్ పడే అవకాశం ఉందని కాబట్టి ప్రజలంతా తమ ఓటు హక్కు కాపాడుకోవడం కోసం సకాలంలో ఫారంలు నింపి దానిని ఆన్లైన్ చే యించుకోవాలని ఆయన కోరారు. నిరక్షరాస్యుల ఓటర్లకి కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ లు వాళ్ళు ఫారంలు నింపి ఇవ్వ డంలో సహాయం చేయాల ని,కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏలు ఎస్ఐఆర్ ప్రక్రియ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, మాజీ డిసిసిబి చైర్మ న్ అడ్డి బోజ రెడ్డి, మాజీ ము న్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, మాజీ మున్సిపల్ ఫ్లో ర్ లీడర్, జిల్లా కాంగ్రెస్ జనర ల్ సెక్రెటరీ గౌలి సంజీవ్ కుమా ర్ , జిల్లా కాంగ్రెస్ ఎస్సి విభా గం చైర్మన్ పరమేశ్వర్, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం చై ర్మన్ సయ్యద్ శాహీద్ అలీ, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ లు మల్యాల కరుణాకర్, సెక్ర టరీ అగ్గిమల్ల రమేష్ యాద వ్, గుడి హత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు, కాంగ్రెస్ నాయ కులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు



**నేరడిగొండ, జూలై 13 (ప్రజాజ్యోతి):** మండలంలోని యాపల్గూడా గ్రామంలో 'న్యాచురల్ రీసెర్చ్ మేనేజ్మెంట్' (సహజ వనరుల యాజమాన్యం) అంశంపై రైతులకు మంగళవారం ఒక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఫెసిలిటేటర్లు విస్లావత్ రవీందర్, జాదవ్ ఇందల్ రైతులకు ఆధునిక మరియు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించారు.ఆ నాలుగు సూత్రాలు పాటిస్తేనే అధిక దిగుబడులు వ్యవసాయంలో ఆశించిన లాభాలు సాధించాలంటే రైట్ సోర్స్, రైట్ రేట్, రైట్ టైం, రైట్ ప్లేస్ (సరైన వనరు, సరైన మోతాదు, సరైన సమయం, సరైన స్థలం) అనే నాలుగు ముఖ్యమైన పద్ధతులను పాటించాలని వారు రైతులకు సూచించారు. ఎరువుల సామాన్య వినియోగం మరియు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరిస్తూ.. ఫారం పాండ్స్ (పంటకుంటల) ప్రాముఖ్యతను, సహజ వనరుల సంరక్షణ ఆవశ్య కతను రైతులకు కూలంకషంగా వివరించారు. పురుగుమందుల ఖాళీ డబ్బాలను ఎక్కడపడితే అక్కడ పడేసి పర్యావరణాన్ని పాడుచేయకూడదని, వాటిని సేకరించి రీసైకిలింగ్ చేసే వారికి అప్పగించాలని కోరారు. గొర్రెల మందల (షిప్ పెన్నింగ్) ప్రాముఖ్యత:పొలాల్లో గొర్రెల మందలను కూర్చోబెట్టడం (షిప్ పెన్నింగ్) వల్ల నేల సారవంతం పెరుగుతుందని, ఇది సేంద్రియ వ్యవసాయానికి ఎంతో దోహదపడుతుందని వివరించారు. 45 రోజుల వరకు పురుగుమందులు వద్దు పంట వేసిన మొదటి లి45 రోజుల వరకులి ఎలాంటి రసాయన పురుగుమందులు పిచికారీ చేయకూడదని వారు స్పష్టం చేశారు. ఒకవేళ పంటపై పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే, రసాయన మందులకు ప్రత్యామ్నాయంగా: లింగసంపర్క బుట్టలు (ఫెరమోన్ ట్రాప్స్)జిగురు అట్టలు ,వేప నూనె (నీమ్ ఆయిల్) మొదలైన పద్ధతులను ఉపయోగించి పురుగులను నివారించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన పొందారు.

# ఎస్ ఐ ఆర్ సర్వేలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బిఎల్ ఏలు ఓటర్లకు అందుబాటులో ఉండాలి

**ఓటర్ల అనుమానాలు నివృత్తి చేయాలి**

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**సర్ సర్వే పై ఇంద్రవెల్లి, సిరి కొండ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు,బి ఎల్ ఏ లతో సమావేశం**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 13, (ప్రజా జ్యోతి)** ఎస్ ఐఆర్ సర్వేలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,బి ఎల్ ఏలు చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉండాల ని, ఎన్యూమరేషన్ త్వరగా పూర్తి చేసి బి ఎల్ వోలకు అందజేయాలని,ప్రజలకు సర్ సర్వే పైన అవగాహన కల్పి స్తూ,వారి ఓట్ల రక్షణకు తో డుండా లని ఎమ్మెల్యే వెడ్మ బొ జ్జు పటేల్ అన్నారు.అలాగే ఈ కార్యక్రమం లో ముఖ్యంగా ముందుగా కార్యకర్తలకు మా ట్లాడడానికి అవకాశం ఇచ్చిన అనంతరం మండల నాయకు లకు అవకాశం ఇచ్చారు. వా రికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభు త్వంలో ఏమి అభివృద్ధి జరగ లేదని, మన ప్రజా ప్రభుత్వం అన్ని రకాల ప్రజలకు అండ దండలుగా ఉంటున్నామని అన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశా ల మేరకు ప్రతి మండల కేం ద్రంలో బూత్ లెవెల్ నుండి మండల లెవల్ వరకు కార్యక ర్తలతోటి ముఖ్య సమావేశాలు నిర్వహించి సర్ పై ఉన్న సందేహాలను, బిఎల్ఏలకు సహకరించి వారికి సర్కు సంబం ధించిన పత్రాలను అందే విధంగా చూడాలని అన్నారు. బిఎల్ ఏలు ముఖ్యమైన కీలక పాత్ర పోషించి ఓట్లుతొ లగించకుండా చూస్తూ సర్ ప్ర క్రియను పూర్తి చేయాలని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఏ ఎంసీ చైర్మన్, డైరెక్టర్లు, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు మండల నాయకులు గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మ న్ ను కలిసిన జిల్లా గిరిజన సర్పంచ్లు



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 13, (ప్రజా జ్యోతి)** హైదరాబాద్ లోని బషీర్ బాగ్లోని పరిశ్రమ భవన్, కమిషన్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంక టయ్య ని సిరికొండ మండలం రాయి గూడ సర్పంచ్ పెందూ ర్ లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో పలువురు జిల్లా గిరిజన స ర్పంచ్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ ను శాలువాతో సన్మానించి సత్కరించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఇందులో రాయిగూడ గ్రామ సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్ రావు తో పాటు లక్షెట్టిపెట్ సర్పంచ్ కోట్నక్ వనిత, ఈశ్వర్ నగర్ సర్పంచ్ రాథోడ్ శారదా, గదిగుడా సర్పంచ్ గోడం నర్మదా, సీతాగొంది సర్పంచ్ తమ్మల అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బియ్యం సంతోష్ ను కలిసిన ఐటీడీఏ పీవో



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 13, (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర గిరిజన సం క్షేమ శాఖ డైరెక్టర్ బి.ఎం. సంతోష్ ను ఉట్నూర్ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మంద మక రందు ఐఏఎస్ మర్యాద పూ ర్వకంగా కలిశారు. సోమవా రం ఐటిడిఎ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, ఐఏఎస్, గిరిజన సంక్షేమ శా ఖ డైరెక్టర్ బి. ఎం. సంతోష్, ఐఏఎస్ ని మర్యాద పూర్వ కంగా కలిసి, ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లాలో గిరిజనుల అభి వృద్ధికి సంబంధించిన పలు కీ లక అంశాలపై విస్తృతంగా చ ర్చించారు. ఈ సందర్భంగా ఉ ట్నూర్ యువజన శిక్షణ కేం ద్రం (వైటిసి) ఆధునీకరణ (ఖజూస్త్రతీఘఖ్ఱశీఅ), గిరిజన యువతకు మెరుగైన నైపు ణ్యాభివృద్ధి శిక్షణలు, వసతి, మౌలిక సదుపాయాల కల్పన కు సంబంధించిన ప్రతిపాదన లను వివరించారు. గోండి భా ష పరిరక్షణ, ప్రోత్సాహం, డి జిటల్ వినియోగాన్ని విస్తరిం చేందుకు రూపొందించిన గోండి అప్లికేషన్ ప్రాజెక్టు ఆమోదం అంశంపై చర్చించి, ప్రాజెక్టును త్వరితగ తిన అమలు చేసేందుకు అవ సరమైన చర్యలను వివరించా రు.గిరిజనుల జీవనోపాధి అ భివృద్ధి దిశగా మహువా (ఇ ప్ప) ఉత్పత్తుల సరఫరా గొలుసు (మీఘప్ట్రఋ ాబజూజూశ్రీఎ జప్ఘ ఱఅ) ప్రాజెక్టు ప్రారంభంపై కూ డా చర్చ జరిగింది. మహువా సేకరణ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కె టింగ్, గిరిజన మహిళల ఆదాయ వృద్ధికి ఈ ప్రాజెక్టు దో హదపడుతుందని ప్రాజెక్టు అధికారి వివరించారు. ఈ సం దర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న డిస్ట్రిక్ట్ ట్రైబల్ డెవలప్మెంట్ ఆఫీస ర్ (డిటిడిఓ) పోస్టులను భర్తీ చేసి అధికారులను నియ మిం చినందుకు డైరెక్టర్ కి ప్రాజెక్టు అధికారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సంక్షేమం, ఉపాధి, జీవనోపాధి, అభివృద్ధికి సంబంధించిన పీఎం జుగా పథకం ప్రాజెక్టులకు ఆమోదం తెలిపి నందుకు కూడా డైరెక్టర్కి ధన్యవాదాలు తెలియజేశారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభి వృద్ధికి అవసరమైన ప్రతిపాద నలకు గిరిజన సంక్షేమ శాఖ పూర్తి సహకారం అందిస్తుంద ని డైరెక్టర్ బి. ఎం. సంతోష్, ఐఏఎస్ హామీ ఇచ్చినట్లు ప్రా జెక్టు అధికారి తెలిపారు.

## కరెంట్ షాక్ తో రైతు మృతి

**కడెం,జులై 13(ప్రజా జ్యోతి):** నిర్మల్ జిల్లా కడెం మండలం పెద్దూరు గ్రామానికి చెందిన జీల నాగరాజు(46) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. సోమవారం ఉదయం తమ వ్యవసాయ బావి వద్ద విద్యుత్ మోటార్ను మరమ్మత్తు చేస్తుండగా ఒక్కసారిగా



విద్యుత్ షాక్ తగలడంతో ఆయన బావిలో పడిపోయి నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పెద్దూరు కడెం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నాగరాజు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. నాగరాజు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కడ ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరిత గతిన పరిష్కరించాలి





**జిల్లా కలెక్టర్ రాజర్షి షా,**

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 13, (ప్రజా జ్యోతి)**ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్ల క్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్లోన మోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భ ద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పథకం, భూభారతి సమస్య లు తదితర అంశాలకు సం బంధించిన మొత్తం 85 ఫిర్యా దులు అందాయి. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, శాఖల అధికారు లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారా నికి తీసుకున్న చర్యలను నిర్ణీ త సమయంలో ప్రజావాణి పో ర్టల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, ఏవో వర్ణ,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే మొదటి ప్రాధాన్యత

**ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవ గాహన సదస్సు**

**బస్సుల ఫిట్నెస్, సీసీటీవీ కెమెరాలు,ఫైర్ సేఫ్టీ పరికరాలు, అటెండర్ తప్పనిసరిగా ఉండాలి**

**ట్రాఫిక్ పార్క్ లో రోడ్డు భద్రతపై అవగాహన**

**పిల్లల ప్రాణాలు, వారి భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆశలు బస్సు డ్రైవర్ల చేతుల్లో ఉంటాయని ప్రతి డ్రైవర్ గుర్తుంచు కోవాలి**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 13, (ప్రజా జ్యోతి)** విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని, పాఠశాలలు, కళాశాలలకు చెందిన ప్రతి బస్సు పూర్తి స్థాయి ఫిట్నెస్తో పాటు అన్ని భద్రతా ప్రమాణాలను త ప్పనిసరిగా పాటించాలని జి ల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అన్నారు. సోమవా రం స్థానిక ఆదిలాబాద్ పట్టణంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇ న్స్టిట్యూట్లో జిల్లా ఎస్పీ అ ఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆధ్వ ర్యంలో జిల్లాలోని ప్రైవేట్ పా ఠశాలలు, కళాశాలల యాజ మాన్యాలు, బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రత, విద్యార్థుల రవా ణా భద్రత, బస్సుల్లో జరిగే ప్ర మాదాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సు మారు 200 మంది పాఠశాల, కళాశాలల యాజమాన్య ప్రతి నిధులు, బస్సు డ్రైవర్లు పా ల్గొన్నారు. ఈ సందర్భంగా జి ల్లా ఎస్పీ అఖిల్ మహా జన్ మాట్లాడుతూ, విద్యార్థులను తరలించే ప్రతి బస్సు పూర్తి స్థాయి ఫిట్నెస్తో ఉండాలని, బస్సుల్లో తప్పనిసరిగా సీసీటీ వీ కెమెరాలు, ఎమర్జెన్సీ ఎగ్జి ట్, ఫైర్ ఎక్స్టింగ్విషర్ వంటి భద్రతా పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి బస్సులో డ్రైవర్తో పాటు ఒక అటెండర్ తప్పనిసరిగా ఉం డాలని, విద్యార్థులు బస్సు ఎక్కే సమయంలో, దిగే సమ యంలో, ఇంటి వద్ద దింపే స మయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదే శించారు. బస్సు నడిపే ప్రతి డ్రైవర్కు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ఆరోగ్యంపై ప్రత్యే క శ్రద్ధ వహిస్తూ ప్రతి ఆరు నెల లకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచిం చారు. సరైన విశ్రాంతి, తగిన నిద్ర అనంతరమే విధులకు హాజరై వాహనాలు నడపాల ని తెలిపారు. ఎట్టి పరిస్థితు ల్లోనూ మద్యం సేవించి వాహ నాలు నడపరాదని స్పష్టం చే సిన జిల్లా ఎస్పీ, డ్రంక్ అండ్ డ్రైవ్కు పాల్పడిన డ్రైవర్లపై మాత్రమే కాకుండా సంబంధి త పాఠశాల లేదా కళాశాల యాజమాన్యంపైనా చట్టపర మైన కేసులు నమోదు చేయ బడతాయని హెచ్చరించారు. జాతీయ రహదారులపై అతి వేగం అత్యంత ప్రమాదకరమ ని, సమయానికి పాఠశాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో వేగం గా బస్సులు నడపడం ఎట్టి ప రి స్థితుల్లోనూ సమర్థనీయం కాదన్నారు. రాంగ్ సైడ్, రాంగ్ రూట్లో ప్రయాణించడం, ని ర్లక్ష్యంగా ఓవర్టేక్ చేయడం వంటి చర్యలు తీవ్ర ప్రమాదా లకు దారి తీస్తాయని పేర్కొ న్నారు. రైల్వే గేట్ల వద్ద ప్రత్యేక అప్రమత్తతతో వ్యవ హరించా లని, గేట్లు మూసి ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేం దుకు ప్రయత్నించరాదని సూ చించారు. విద్యార్థులు ప్రయా ణించే సమయంలో వారు బ స్సు కిటికీల్లో నుంచి చేతులు, తలలు బయటకు పెట్టకుండా డ్రైవర్, అటెండర్ నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. “చిన్నారుల ప్రాణాలు, వారి భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆశలు మీచేతుల్లో ఉంటాయి. మీరు నడిపేది కేవలం బస్సు కాదు... అనేక కుటుంబాల భవిష్యత్తు. అందుకే ప్రతి ప్ర యాణాన్ని అత్యంత బాధ్యత తో, అప్రమత్తంగా నిర్వహించాలి” అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో ఆదిలా బాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, టౌన్ సీఐలు బి. సునీల్ కుమార్, కె. నాగరాజు, ప్రణయ్ కుమార్, ట్రాఫిక్ పోలీసు అధి కారులు, సిబ్బంది, ప్రైవేట్ పా ఠశాలలు, కళాశాలల యాజ మాన్య ప్రతినిధులు, బస్సు డ్రైవర్లు తదితరులు పాల్గొ న్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

## ఐటిడిఏ ఎపిఓ వసంతరావు



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 13, (ప్రజా జ్యోతి)** ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖా స్తులపై క్షేత్రస్థాయి లో పరిశీ లించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వ యంతో చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఐటీడీఏ ఏపీవో జనరల్ వసంతరావు అన్నారు. సోమవారం కార్యాలయం నిర్వహించిన ప్రజావాణి కార్య క్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిం చారు. ఉట్నూర్ మండలం సే కుగూడా గ్రామానికి చెందిన టె కం ఓంసాయి బాయి తనకి పై చదువుల కొరకు ఆర్థిక సహా యం అర్జీ ,సిరికొండ మండల సుమాంగోంది గ్రామానికి చెందిన రాథోడ్ పరుబాయ్ తనకి రైతు భరోసా మంజూరు కొరకు అర్జీ కోరారు. వాంకిడి మండలం బంబార గ్రామానికి చెందిన మారు బాయి తనకి భూమి పట్టా మంజూరు కల్పించాలని అర్జీ కోరారు. సిరికొండ మండలం వైపేట్ గ్రామానికి చెందిన రవీందర్ తనకి టెంట్ హౌస్ లోన్ ఇప్పించాలని దర ఖాస్తు పెట్టారు. ఉట్నూర్ మండలం హీరాపూర్ గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రా మానికి బోర్ వెల్, త్రిఫేజ్ వి ద్యుత్, సోలార్ మంజూరు కల్పించాలని కోరారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉఢి పథకాల మంజూరు, వ్య వసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారు లు పాల్గొన్నారు.

# కెమికల్ డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు

**7 గురు నిందితులపై కేసు నమోదు ముగ్గురు అరెస్టు -- నలుగురు పరారీ**

**"టర్మిన్" మత్తు ఇంజెక్షన్ల విక్రయం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**190 ఇన్సులిన్ సిరంజి లు, 50 టర్మిన్ బాటిల్స్, ఒక స్కూటీ రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం**






**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 13, (ప్రజా జ్యోతి)** కెమికల్ డ్రగ్స్ విక్రయిస్తున్న మూఠా గుట్టు పోలీసులు ర ట్టు చేశారు. ఏడుగురు నింది తులపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. మ రో నలుగురు పరారీలో ఉ న్నారు. టర్మిన్ మత్తు ఇంజక్ష న్ లు ఈ మూఠ విక్రయిస్తు న్నారు. 190 ఇన్సులిన్ సిరంజిలు, 50 టర్మిన్ బాటిల్స్, ఒ క స్కూటీ, 2 మొబైల్ ఫోన్లు వీరి నుండి పోలీసులు స్వాధీ నం చేసుకున్నారు.ఎ-1: సిందే జగన్నాథ్(50), గుణవం తరావు, వృత్తి: ఆర్ఎంపీ డాక్టర్, నివాసం: శాంతినగర్, ఆది లాబాద్. (అరెస్టు), ఎ-2: రమేష్ గౌడ్, జగదాంబ ఫార్మసీ సర్జికల్స్ ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపం, ఆదిలాబాద్. (పరా రీలో) ఎ-3: సయ్యద్ కమరు ద్దీన్, గెట్ వెల్ మెడికల్, పాత బస్ స్టాండ్, ఆదిలాబాద్, నివాసం: మసూద్‌నగర్, ఆదిలాబాద్. (అరెస్టు) ఎ4: ము షారఫ్. (ఇప్పటికే మరో కేసులో జైలులో ఉన్నాడు)ఎ-5: సమీర్. (పరారీలో)ఎ-6: ఇర్ఫాన్ ఖాన్. (పరారీలో)ఎ-7: ముకీద్. (పరారీలో)లపై కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలో కెమికల్ డ్రగ్స్ అక్రమ విక్రయాలకు పాల్పడుతు న్న ముఠాను టూ టౌన్ పోలీ సులు ఛేదించి, ఏడుగురు నిం దితులపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు జి ల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ తెలిపారు. జూలై 12 రాత్రి ఆర్టీసీ బస్టాండ్ వద్ద వా హనాల తనిఖీలు నిర్వహిస్తు న్న సమయంలో అనుమానా స్పదంగా స్కూటీపై సంచరిస్తు న్న వ్యక్తిని పోలీసులు అడ్డు కునే ప్రయత్నం చేయగా పారి పోవడానికి యత్నించాడు. వెంటనే పోలీసులు వెంబడిం చి పట్టుకుని విచారించగా నిందితుడు సిందే జగన్నాథ్ (ఆర్ ఎంపీ వైద్యుడు) అని తెలింది. విచారణలో సర్జరీల సమయంలో మాత్రమే వినియో గించాల్సిన "టర్మిన్ అనే మత్తు పదా ర్థాన్ని మెడికల్ ఏజెన్సీ, మెడి కల్ షాపు నిర్వాహకుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, గంజాయి వినియోగ దారులు, ఇతర వ్యక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్ల డైంది. ఈ కేసులో ఏ-1 సిందే జగన్నాథ్, ఏ-3 సయ్యద్ కమ రుద్దీన్ (గెట్ వెల్ మెడికల్)తో పాటు మరో నిందితుడిని పో లీసులు అదుపులోకి తీసుకో గా, ఏ-2 రమేష్ గౌడ్ (జగ దాంబ ఫార్మసీ ఉ సర్జికల్స్), ముషారఫ్, సమీర్, ఇర్ఫాన్ ఖాన్, ముకీద్ పరారీలో ఉ న్నారని తెలిపారు. వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ఇంజక్షన్ ధర 390 ఉండగా దానిని బహిరంగ మార్కెట్లో 1500 వరకు అమ్ముతూ సొమ్ము చేసు కుంటున్న నేరగాలను కట్టడి చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా ఈ మందులు డాక్టర్లకు మాత్రమే విక్రయించాల్సిందిగా ఉండగా నేరస్తులు బహిరంగంగా ప్రజలకు విక్రయిస్తూ ఉన్నారని తెలిపారు. నిందితు ల వద్ద నుండి 190 ఇన్సులిన్ సిరం జులు, 50 టర్మిన్ బాటిల్స్, రెండు మొబైల్ ఫోన్స్, ఒక స్కూటీ స్వాధీనం చేసుకోవ డం జరిగింది అని తెలిపారు.గతంలో కూడా ఆదిలాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ట ర్మిన్ మత్తు ఇంజెక్షన్లను దొంగ తనం చేసిన నిందితులను పో లీసులు అరెస్టు చేసిన విషయాన్ని ఎస్పీ గుర్తు చేశారు. వై ద్య అవసరాలకు మాత్రమే వినియోగించాల్సిన మత్తు పదా ర్థాలను అక్రమంగా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ఈ కేసును ఛేదించిన ఆదిలా బాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ కె. నాగరాజు, ఎస్ఐ అఖిల్,ప్రణయ్ కుమార్ పా ల్గొన్నారు.

## హైదరాబాద్ లోని మాడ్యుల స్ ను సందర్శించిన ఐటీడీఏ పీవో మంద మకరందు



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 13 (ప్రజా జ్యోతి)** హైదరాబాద్ లోని మాడ్యుల స్ అకాడమిని ఐటిడిఏ ఉ ట్నూర్ ప్రాజెక్టు అధికారి మం ద మకరందం సందర్శించారు.గిరి శిక్షణ సహాయం కార్యక్ర మం ద్వారా గిరిజన ప్రాంతాలకు చెందిన పేద, ప్రతిభావం తులైన విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఐఐటీ-జేఈఈ కో చింగ్ అందిస్తున్నారు. ఇందు లో భాగంగా హైదరాబాద్‌లోని మాడ్యులస్ కాలేజీ సహకా రంతో గత విద్యా సంవత్సరం లో 15 మంది గిరిజన విద్యా ర్థులను ఐఐటీ-జేఈఈ కోచిం గ్‌లో చేర్పించగా, ఈ విద్యా సంవత్సరంలో కూడా మరో 15 మంది విద్యార్థులకు ప్రవే శం కల్పించారు. మాడ్యులస్ అకాడమీ ఐఐటీ-జేఈఈ శిక్ష ణలో ప్రత్యేక నైపుణ్యంతో ప నిచేస్తోంది.ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం మందా మకరందు, ఐ.ఏ.ఎస్., ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ ఉట్నూర్ మాడ్యులస్ కాలేజీని సంద ర్శించి, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. వారి విద్యా భ్యాసం, కోచింగ్ పురోగతి, వసతి, భోజ నం తదితర సౌక ర్యాలపై ఆరా తీశారు.విద్యా ర్థులు ఐఐటీ-జేఈ ఈ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందాలని ఆకాంక్షి స్తూ, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చద వాలని సూచించారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తు అభి వృద్ధికి ఐటీడీఏ అన్ని విధా లుగా అండగా ఉంటుందని ప్రాజెక్టు అధికారి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం గిరిజన విద్యార్థుల్లో పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించడంతో పాటు, వారిని జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ప్రోత్సహించే దిశగా ఒక ము ఖ్యమైన ముందడుగుగా నిలు స్తోంది.

## సంచార వర్గాలకు స్థిరమైన బరోసా కల్పిస్తున్న బీజేపీ నా యకులు



**ఇచ్చోడ, జూలై 13, (ప్రజా జ్యోతి)** ఆది లాబాద్ జిల్లా ఇచ్చో డ మండలం ఆడేగా మా (కే) గ్రామ పరిధిలోని భీమన్న గుట్ట వద్ద నివాస ముంటున్న సంచార వర్గాల ప్రజలకు భార తీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి పైగా ఎస్ ఐ ఆర్ ఎన్యుమరేషన్ ఫారాల ను నింపించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు అయ్యేలా అవసరమైన సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా సంచార వర్గాల ప్రజలకు ఓటు హక్కు పరి రక్షణతో పాటు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుకు నే దిశగా స్థిరమైన భరోసా కల్పించినట్లు నాయకులు తెలి పారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుని ఓటు హక్కు అత్యం త విలువైనదని, అందరూ త ప్పనిసరిగా ఎస్ ఐ ఆర్ ప్రక్రి యను పూర్తి చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్ రావ్ అంటే, మండల నాయకులు అంబేకర్ పాండురంగ్, బొడ్డు సత్యప్రకాష్, తదితరు లు పాల్గొని ప్రజలకు అవస రమైన సూచనలు అందిస్తూ ఫారాల నింపే ప్రక్రియను నిర్వ హించారు.